క్లుప్తంగా

తప్పిన విద్యుత్ ప్రమాదం



సి.బెళగల్ బస్టాండ్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ స్పార్కింగ్‌తో వెలుగుతున్న మంట

సి.బెళగల్: స్థానిక బస్టాండ్ ఆవరణలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆదివారం ఉదయం స్పార్కింగ్‌తో మంటలు చెలరేగాయి. దీంతో బస్టాండ్‌లో ఉన్న ప్రజలు, వ్యాపారస్తులు, ప్రయాణికులు ఆందోళనలు చెందారు. స్థానికులు విషయాన్ని విద్యుత్ అధికారులకు తెలపడంతో సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేసి వెంటనే మరమ్మతు పనులు చేపట్టారు. విద్యుత్ సిబ్బంది సత్వరం స్పందించక పోతే పెను ప్రమాదం సంభవించేదని స్థానికులు తెలిపారు. ఇకపై ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా విద్యుత్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజానీకం కోరుతున్నారు.

కబడ్డీ విజేత గోనెగండ్ల



విజేతలకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

గడివేముల: మండల పరిధిలోని మంచాలకట్ట గ్రామంలో దివ్య బాలయేసు పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు సోమవారంతో ముగిశాయి. పోటీల్లో 50 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేత గోనెగండ్ల జట్టు, రన్నరప్ నూతనపల్లి, తరువాతి స్థానాల్లో వరుసగా పంచాలింగాల, శివనంది, మంచాలకట్ట, గడివేముల జట్లు నిలిచాయి. విజేతలకు ఫాదర్ తోట జోసెఫ్ బహుమతులను అందజేశారు. నంద్యాల డీన్ ఫాదర్ మారెడ్డి, విచారణ గురువులు ఫాదర్ జోసెఫ్, కల్లూరు విచారణ గురువులు ఫాదర్ లహస్రయి, జీవ సుధ పాస్టరల్ డైరెక్టర్ ఫాదర్ బాలరాజు,గ్రామ పెద్దలు, సంఘపెద్దలు పాల్గొన్నారు. సాయంత్రం గ్రామంలోని దివ్య బాలయేసు పండగను గ్రామస్తులు, బంధువులు ఉత్సాహంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహాగణ గోరంట్ల జాన్వేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చినప్పుడే పండుగ

కర్నూలు (రూరల్): మండల పరిధిలోని ఉల్చాల గ్రామంలో సంక్రాంతి సందర్భంగా సోమవారం ముగ్గుల పోటీల కార్యక్రమాన్ని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల వల్ల కష్టపడి పంటలు పండించే రైతులకు, వ్యవసాయ కూలీలకు తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి ఉంటే సంక్రాంతి పండుగ సంతోషంగా జరుపుకునే వాళ్లమని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై వేసిన విద్యుత్ ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి నాయకులు రోజూ ఒకరినొకరు పొగుడుకోవడం, నిందించుకోవడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. సూపర్ సిక్స్ హామీలను ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పీఎస్ రాధాకృష్ణ, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి అలివేలు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా పాల్గొన్నారు.

గంగపూజకు బయలుదేరిన మల్లెందొడ్డి స్వామి

సి.బెళగల్: గొల్లలదొడ్డి గ్రామంలో కళ్యాల గోత్రం కురువల ఆరాధ్య దైవం మల్లందొడ్డి స్వామి వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు గంగా పూజా కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని దేవర ఇంటి నుంచి స్వామి వారి ఉత్సవమూర్తిని పల్లకీలో ఊరేగింపుగా లింగాల ఆలయానికి చేర్చారు. సాయంత్రం గంగాపూజ కోసం నందవరం మండలంలోని రాయచోటికి తీసుకెళ్లారు.



కోడుమూరులో రంగురంగుల ముగ్గు వేస్తున్న బాలికలు



కోడుమూరులో భోగి మంటలు వేసుకున్న ప్రజలు



గూడూరులో ఆకట్టుకునేలా రంగవల్లిని తీర్చిదిద్దిన చిన్నారులు



సి.బెళగల్: రంగుల ముగ్గును వేస్తున్న మహిళలు

భోగి ముగ్గులు.. మురిసిన లోగిళ్లు

సి.బెళగల్/కోడుమూరు రూరల్/పాణ్యం/గడివేముల: అందమైన ముత్యాల ముగ్గులతో తెలుగింటి లోగిళ్లు మురిసిపోయాయి. మహిళలు సంక్రాంతి సంబరాలను స్వాగతిస్తూ ఆదివారం రాత్రి నుంచి సోమవారం వేకువజాము వరకు ఇంటి ఆవరణాలలో కళ్లాపిచల్లి, రంగురంగుల ముగ్గులను తీర్చిదిద్దారు. సి.బెళగల్‌లోని, కొమటి, బోయ తెలుగు వీధులతో పాటు గ్రామంలోకి వెళ్లు ప్రధాన రహదారి, ఎమ్మిగనూర్ – గూడూరు మెయిన్ రోడ్డులో వెలసిన అంగళ్ల ముందు స్థానిక మహిళలు ముగ్గులను చూడముచ్చటగా రూపొందిచారు. పల్లె పండుగలో భాగంగా మహిళలు భోగికి శుభాకాంక్షలు తెలుపుతూ, మకర సంక్రాంతికి స్వాగతం పలికారు. సుందరమైన ముగ్గులను వేసి అందులో ఆవుపేడతో చేసిన గొబ్బిళ్లను, పూలను, రేగిపళ్లను ఉంచారు. కొందరు యువకులు భోగి మంటలు వేసుకుని సంబరాలు జరుపుకున్నారు. పాణ్యం మండలంలోని తమ్మరాజుపల్లె గ్రామంలోని రామాలయం వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా అధిక సంఖ్యలో పాల్గొని రంగురంగుల చూడముచ్చటగా రూపొందించారు. పోటీలను తిలకించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాంప్రదాయాలు పాటిస్తూ గంగిరెద్దుల వారు గ్రామాల్లో ప్రతి ఇళ్లు తిరిగారు. ప్రజలకు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



తమ్మరాజుపల్లెలో ముగ్గుల పోటీలు,



గని గ్రామంలో భోగి మంట వేసిన గ్రామస్తులు

భోగేశ్వర స్వామికి రుద్రాభిషేకం



గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలో కొలువైన, దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ దుర్గా భోగేశ్వర స్వామి వారి సన్నిధిలో సోమవారం ఆరుద్ర నక్షత్రం, పౌర్ణమి కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే భోగి పండుగ కావడంతో ఆలయ ప్రధాన అర్చకులు శ్యామ్ సుందర్ శర్మ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం భోగేశ్వర స్వామికి మహా రుద్రాభిషేకం, రుద్రహోమం, అష్ట విధ మహా మంగళ హారతులు, మంత్రపుష్పం పూజలు చేపట్టారు. అమ్మవారికి కుంకుమార్చన పూజలు జరిపారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

కల్లూరు: భోగి పండుగ సందర్భంగా వీరశైవ లింగాయత్ సమితి ఆధ్వర్యంలో కల్లూరు ఊరి వాకిలి వద్ద లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు అధ్యక్షుడు చంద్రశేఖరప్ప చెప్పారు. సోమవారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పోటీలో విజేతలైన వారికి మొదటి, రెండవ, మూడవ బహుమతులను నిర్వాహకులు అందజేశారు. మొదటి బహుమతి- రేవతి, రెండవ బహుమతి- జానకి, మూడవ బహుమతి- హేమలత గెలుపొందారు.

విద్యుత్ బిల్లులు దహనం చేసి నిరసన



భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



కోడుమూరులో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఐ, మహిళా నాయకురాళ్లు

కల్లూరు: ఎన్నికల ముందు సీఎం చంద్రబాబునాయుడు కరెంటు చార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచారని సీపీఎం నాయకులు మండిపడ్డారు. సోమవారం భోగి పండగ సందర్భంగా కల్లూరు గ్రామీణ, అర్బన్ 19, 20, 30, 32, 33వ వార్డులలో సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా బిల్లులను భోగిమంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు సుధాకరప్ప, సాయిబాబా, ప్రభాకర్, రాముడు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.20 వేల కోట్లు ప్రజలపై భారం వేశారన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను మభ్యపెట్టి మూడు టారిఫ్‌లు అమలు చేసి చార్జీలను పెంచాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని దీనికి సీపీఎం వ్యతిరేకమన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను ఆపాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలన్నారు. సీపీఎం నాయకులు ధనలక్ష్మి, శ్రీనివాసులు, గోవిందు, సూర్యనారాయణ, మధు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఐ, సీపీఎంల ఆధ్వర్యంలో కోడుమూరులో భోగి మంటల్లో కరెంట్ బిల్లులను ప్రజలు దగ్ధం చేసిన నిరసన తెలిపారు. ఏపీ మహిళా సమాఖ్య సమితి సభ్యురాలు సులోచనమ్మ మాట్లాడుతూ.. అధికారంలోకి రాక ముందువిద్యుత్ చార్జీలను పెంచబోమని చెప్పి నేడు ట్రూ అప్ చార్జీల పేరుతో భారీగా పెంచడం దారుణమన్నారు. మహిళలకు తల్లికి వందనం, ఉచిత బస్సు సౌకర్యం వంటి హామీలిచ్చి అధికారంలోకొచ్చి 7 నెలలైనా అమలు చేయకపోవడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. సీపీఐ మండల కార్యదర్శి రాజు, సీఐటీయూ, సీపీఎం మండల కార్యదర్శులు వీరన్న, కామార్తి రాజు మాట్లాడారు, నాయకులు బాలమ్మ, పుష్పావతి, శాంతమ్మ, వీరన్న, గంగాధర్, కుమార్, బుడ్డప్ప, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో..

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం గూడూరులో సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి మోహన్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో కాల్చి నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, రాజశేఖర్, దానమన్న, మధు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలి

ఓర్వకల్లు: ట్రూ ఆఫ్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై మోపిన విద్యుత్ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని కేతవరం గ్రామంలో సోమవారం భోగి సందర్భంగా కరెంట్ బిల్లులను మంటల్లో దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం మండల కార్యదర్శి నాగన్న, ఓర్వకల్లు, కేతవరం కార్యదర్శులు సుధాకర్, శ్రీధర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకపోవడమేగాక, ప్రజలపై ఏదో ఒక రూపంలో ఆర్థిక భారం మోపాలని చూడడం దారుణమన్నారు. ఎన్నికల ముందు వ్యవసాయ మోటార్లకు మీటర్లను అమర్చితే పగులగొట్టాలని పిలుపునిచ్చిన కూటమి నాయకులు ఇప్పుడు మోటార్లకు, షాపులకు, ఇళ్లకు కూడా స్మార్టు మీటర్లు బిగించడం ఏమిటని విమర్శించారు. సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, శివన్న, బుగ్గరాముడు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని ఉల్చాల, ఈ.తాండ్రపాడు గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి గ్రామస్తులు నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపెంచిన విద్యుత్ చార్జీలను వ్యతిరేకిస్తూ, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు సీపీఎం నాయకులు బాలపీర, రాఘవేంద్ర తెలిపారు. డీవైఎఫ్ఐ, రైతు సంఘం, సీపీఎం నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ఓర్వకల్లులో కరెంట్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



ఈ.తాండ్రపాడులో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న గ్రామస్తులు

పార్టీ కోసం కష్టపడే వారికి సముచిత స్థానం



వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న అఫీషియల్ స్పోక్స్ పర్సన్ నారాయణరెడ్డి

కల్లూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా విభాగాల్లో అనుబంధ సంఘాల అధ్యక్షులుగా, మండలాల అధ్యక్షులుగా పదవులు పొందిన వారందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అఫీషియల్ స్పోక్స్ పర్సన్‌గా నియమితులైన కార్పొరేటర్ నారాయణరెడ్డి సోమవారం కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పూలమాలలు వేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. కర్నూలు, నంద్యాల జిల్లాలతో పాటు నియోజకవర్గం, మండలాల అధ్యక్షులుగా నియమితులైన వారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి సముచిత స్థానం లభిస్తుందన్నారు. మాజీ సర్పంచ్‌లు సత్యంరెడ్డి, బాబాన్న, మాజీ ఎంపీటీసీ సుబ్రమణ్య స్వామి, నడిపెన్న, గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు పెద్దపీట

వైఎస్సార్‌సీపీ బీసీలకు పెద్దపీట వేస్తుందని కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన కురువ పెద్ద ఈశ్వరయ్య సోమవారం కాటసానిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సత్కరించి, పూలమాలలు వేసి కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్‌లు లక్ష్మన్న, మద్దిలేటి, గణ మద్దిలేటి, ఎంపీటీసీ సామన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

భోగి పండగ సందర్భంగా కల్లూరు అర్బన్ 32వ వార్డు గోవర్ధన్ నగర్‌లోని పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయంలో కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ, సంతోషలతో ఉండాలని ఆకాంక్షించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రజలకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. చీకట్లు తొలగి ప్రతి ఇంటా సంక్రాతి వెలుగులు నిండాలని, రైతులు పాడి పంటలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్పొరేటర్ సాన శ్రీనివాసులు, ఆలయ అర్చకులు ఉన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



పర్ల హైస్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కోడుమూరు రూరల్: కల్లూరు మండలంలోని పర్ల హైస్కూల్లో 2001-02 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా 24 సంవత్సరాల తర్వాత సోమవారం తిరిగి కలుసుకుని ఉత్సాహంగా గడిపారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా వారికి పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు రామయ్య, మీనాక్షినాయుడు, నాగేష్, ద్వారకానాథ్ శాస్త్రి, గోదాదేవి, నబీ, సంపత్‌కుమార్, కల్పన, జ్యోతి, తైమూర్ బాషాతో పాటు ప్రస్తుత హెచ్ఎం సత్యనారాయణను పూలమాల, దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేసి ఆశీర్వాదాలు పొందారు. పూర్వ విద్యార్థులు షఫీ, రాజశేఖర్, నవాబ్, మద్దిలేటి, రసూల్, జ్యోతి, భారతి, సుజాత, స్వప్న తదితరులున్నారు.









పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



వైఎస్సార్‌సీపీ నాయకులు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్‌లను గజమాలతో సత్కరిస్తున్న గూడూరు మండల నేతలు

కోడుమూరు రూరల్: గ్రామగ్రామాన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలంతా కృషి చేయాలని కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్దన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ సూచించారు. వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన పీఎస్ అస్లాం, గూడూరు మండల అధ్యక్షుడిగా ఎన్నికైన రామాంజనేయులు స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లి సోమవారం కోట్ల హర్షవర్దన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్‌ను గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చనుగొండ్ల ప్రతాప్‌రెడ్డి, గూడూరు నగర పంచాయతీ వైస్ చైర్మన్ లక్ష్మన్న, కౌన్సిలర్లు ఖలీల్‌బాషా, మద్దిలేటి, నంద కిషోర్, కోఆప్షన్ సభ్యులు మదార్ బాషా, కేడీసీసీ మాజీ డైరెక్టర్ పత్తి రంగడు, హబీబ్, షేక్షావలి, సత్యాలు, చికెన్ వలి, ఖాదర్, గిడ్డయ్య, ప్రభాకర్, గోపాల్ తదితరులున్నారు.

15న ఉప్పలపాడుకు గోరంట్ల జాన్వేష్ రాక

ఓర్వకల్లు: ఉప్పలపాడు గ్రామానికి కర్నూలు మేత్రాసనం పీఠాధిపతులు ఘన గోరంట్ల జాన్వెస్ హాజరవుతున్నట్లు విచారణ గురువులు రెవరెండ్ పాస్టర్ ప్రశాంత్‌కుమార్, ఆర్‌సీఎం చర్చి ఉపదేశకులు సత్యరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్‌సీఎం చర్చి సంఘపెద్దల ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన జరిగే మేరీమాత స్వరూపం ఊరేగింపు, దివ్యబలి పూజకు జాన్వేష్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.